గోరీలదొడ్లో

సామిగాడు తెలుగువాడు.

'కడుపులో బంగారు - కనుచూపులో కరుణ చిరునవ్వులో సిరులు - తొణకించు నా తల్లి'...—అని కవులకలాలు కళ్లుమూసుకునిపాడిన తెలుగుతల్లి గర్భాన్నే పుట్టాడు.

'బంగారు పంటలే పండుతాయి-' అన్న తెలుగుతల్లి ఒడిలోనే పెరిగాడు.

సామిగాడి అసలుపేరు స్వామి. ఐతేనేం! అలా ఎవరూ పిలవరు. రెండక్షరాలు పొదుపైనా "సామిగాడు' అనే అంటారు.

జీవితంలో అధికభాగం — దాదాపు అంతా కూడా, బంగారుపంటలమధ్యలోనే గడిచింది. అంతులేని ధాన్యరాసులు అతని చేతిమీదగానే గాదెలకెక్కాయి. ఆ వూళ్లో అనేకవందల పశువులు అతని చేతిక్రిందే పెరిగి పెద్దవయ్యాయి. ఎప్పుడో ఓసారి, మొత్తంమీద, కలిగిన వాళ్ళందరి పొలాలూ, సొత్తులూ ఎవరోవొకరి వాటిని "మా పొలం - మా గొడ్లు" అని పిలిచే వుంటాడు.

ఐతేనేం? అతను 'నా' అని చెప్పుకోవలసివస్తే మాత్రం ఓ చిన్న చుట్టు గుడిసె — గంపెడు సంసారమూ మిగులుతాయి.

ఆవూరి కలిగినవాళ్ళల్లో స్వామిమంచిపేరే సంపాదించుకున్నాడు. అందరికీ అతని మీదే చూపు. ఏరువాక పున్నమ ఇంకా రెండు నెల్లుందనగానే అంతా ఆతనితో గుసగుస లాడేవాళ్ళే.

అందతా — ఎంత కష్టానికైనా ఓర్చి ఏనుగలా పనిచేసే ఆతని దేహం; పనిమీద, ఆసామీ మీదా గలభక్తితో నిద్రకూడా లొంగని అతని గుంటకళ్ళూ; పాచిపోయిన కూడైనా మాట్లాడకుండా తినే ఆనోరూ; ఎన్ని బూతులకైనా ఎదురుతిరగని అతని మానసికతత్వం వాటిదే ఆ గొప్పతనం. అంతా స్వామినే కోరే దందుకే.

మొదట్లో అసలితగాణ్ణి పనిలోపెట్టుకుంటామన్న వాళ్ళే లేకపోయారు. అరేళ్లైనా వెళ్ళని సామ్యాని వెంటేసుకుని వాళ్ళబాబు ఎన్నిగడపలెక్కి — ఎన్నిదిగాడో లెక్కలేదు. 'ఇంతకూడు వేసి చేయించుకోండి' అని ఎందరి కాళ్ళా వేళ్ళాపడ్డాడో చెప్పడంకష్టం. ఆగంపెడుబలగంలో ఒకడు తగ్గినా తగ్గినట్టేనని నానాఅవస్థలూపడ్డాడు. మొదటగా స్వామిని పనిలోపెట్టుకున్న ఆ ఆసామి ఆ కుటుంబానికి దేవుడే ఐపోయాడు.

ఆనాటినుంచీ ఆ చిన్నతనంలోనే స్వామి

ఒళ్ళు ఎన్నోసార్లు కర్ర దెబ్బలకు కండెలుకట్టింది. యికవం టిమీద తెగినత్రాళ్ళు అన్నీయిన్నీ కావు. ఏమాటచివరా 'లంజాకొడకకా' అన్న వూతపదంలేకుండా వాడిందేలేదు.

మొదటిసారి దెబ్బలుతట్టుకోలేక పారిపోయి గుడిసెలోపడిఏడ్చాడు. అమ్మతో 'నేనికపోనేపోన'ని మొత్తుకున్నాడు. కాని —అవిచాలవన్నట్టు బాబుకూడా మళ్లీ కొట్టుకుంటూ ఆఆసామికే అప్పగించాడు. పైగా 'లంజా కొడుకుని బాగాతన్నండి' అన్నాడు. యివన్నీ పనినేర్పడా నికట. యింకదిక్కేది?

మరోసారి పారిపోయి మూన్నాళ్లపాటు జొన్న చేలను దిక్కుచేసుకున్నాడు. తిండిలేకుండా అలాఎన్నాళ్లు..?

ఒకసారి ఎక్కడో గోలీలఆటచూస్తూ నిలబ డ్డాడని వీపు పెట్లిపోయింది. యింకోసారి గారడీఆటకువెళ్లి నందుకు ప్రిర పగిలిపోయింది. మరోసారి ఆ యింటివారి అబ్బాయి ఏదోతింటుంటే నిలువుగ్రుడ్లతో 'దిష్టి'పెట్టాడని వొళ్లంతా వాచిపోయింది. ఏరోజూ అసలు నిద్రలేపడమే దెబ్బలతో తన్నులతో—

తన్నులూ, గుద్దులూ, వీటన్నిటినీ మించి ఆ బె త్తెడు లేతపొట్టకీ అకలిసమస్యా—యివన్నీ అతడిలోని స్వే చ్ఛాతత్వాన్ని ఏమారుమూలకో. అణగద్రొక్కాయి. క్రమంగా అసామీల యిష్టాయిష్టాల ననుసరించే తనజీవి

తాన్ని వంచుకొచ్చాడు. అందుచేతే – అందరుషావు కార్లు 'సామిగాడు మాక్కావాలంటే–మాక్కావాలి' అనే అంతగా వంచుకొచ్చాడు.

ఎంతోమంది యజమానులు మారారు. స్వామి కూడా వయస్సులోనూ ఆకారంలోనూ మారుతూనే వచ్చాడు. ఒక్కొక్కఏడే పైబడ్డకొద్దీ–అంతకుమించిన పను లుకూడా మీదపడుతూనేవచ్చాయి.

ఊడ్పులకాలంలో చేలగట్లన్నీ చెడతిరుగుతూం డేవాడు. రాతింబగళ్ళు, చినుకుల్లో, చిత్తడిలో, కాలవగళ్ళకీ, తూములకీ కాటికాపలా కాస్తూండేవాడు. నూర్పిళ్ళకాలం లోరాత్రి 10గంటలకు నడుంవాలుస్తాడు. మళ్ళా 3గంటలకే పోయికూలీలమీదపడేవాడు. వర్షాకాలంలోకూడా గొడ్లను మేపుకుంటూ 'తాళ్ళోతంకరో' పేనాలి. గాంధీగారి ఆదేశా నుసారం దంపుడుబియ్యానికి వడ్లుదంచాలి. ఇకఏకాలమూ తనసంకటికి మొక్కజొన్నలు తొక్కుకోటంవుండనేవుంది. 360రోజులూ 16 గంటలన్నా ఏదోపని–ఎక్కడోఓచోట.

'స్వామిగాడు, మంచివాడు' గదూ!

యీమంచిపేరు అరగతీయించుకోడానికి తప్ప ఎందుకూ పనికిరాకపోయినా– పెళ్ళాందొరకడానికిమాత్రం పెద్దమంత్రలాగానే పనిచేసింది.

యిరవైరెండోయేట పదిహేనునాగాలూ, యీ

భైరూపాయల అప్పుతో స్వామిపెళ్ళాం ఆచుట్టుగుడిసెలో ప్రవేసించింది.

ప్రవేసించడమేనా? అమరోయేటినుంచి యేడాదికీ రెండేళ్ళకూ ఒకళ్ళుగాసంతానంతో ఆగుడిసె చాలకుండా చేసేసింది. పుట్టీపుట్టడమే పొట్టబట్టుకుని గుట్టలు పట్టాల్సిన పాపలసంఖ్య పదిదాకా పెంచేసింది.

ఏరష్యాలాంటి దేశంలోనోఐతే ఈ సంతానం-దేశానికీ, వాళ్ళకూకూడా లాభం. కాని యీ బలగం యీ దేశంలో ఆకలితో చావడానికి మినహా యెందుకు?

గాంధీగారు ఎప్పుడో అన్నాడట 'హరిజనుడే మన రాజ్యం ఏలుతాడ'ని. ఆ విషయం ఓ భూస్వామి దగ్గర విన్నాడు. స్వామి దాన్ని నమ్ముకొన్నాడు. స్వామికున్న యీ అసలు ఆశకాస్తా నెరవేరితే-యిక మిగతా చిన్న చిన్న వాటికేమిటి?

ఎలాగైనాసరే. తాను ఏమైపోయినామానె. పిల్లల్ని చదివించితీరాలనుకున్నాడు. తంటాలుపడి పెళ్ళాన్ని ఒప్పించాడు.

కాని—పెళ్ళాని కప్పుడప్పుడూ యీ చేతగాని పనికి కోపం వచ్చేది. అందరి పిల్లలూ ఏ అయ్యదగ్గరో వాళ్ళ పొట్టలు వాళ్లు పోసుకుంటుంటే, తమ పిల్లల్ని కూచోబెట్టి మేపడం. పైగా పలకలనీ పుస్తకాలనీ—

స్వామి పెళ్ళాంకూడా చాకిరీలో మొగుడి

కేమీ తీసిపోయేరకం కాదు. పని దొరికినంతలో ఏమీ వృథా పోనిచ్చేదికాదు. ఇక్కడ పనుల్లేని కాలంలో ఏ వేరుశనగ కోతకో ఓ నెల పోయివచ్చేదికూడా. ఐనా ఆ సంసారానికి దంతా ఏమూలకి ......?

స్వామి తెచ్చే జీతం వంద, నిత్యభత్యం మూడు తవ్వలుకూడా ఏ ముక్కులోకి?

యుద్ధమంటూ పెరిగినధరలకు ఆ సంసారం మరింత క్షణగండ మయింది. మంచితనాన్ని ఉపయోగించి ఓ ఎకరం కౌలుకు పుచ్చుకుంటే అదీఅంతేఅయింది. పగలల్లా పెళ్ళామూ, ఆసామీ పనంతా ముగించి రాత్రి తానూ, చేలో దిగేవాళ్లు. వెన్నెలలో ఒక్కడే ఎండుగడ్డ దున్నేవాడు. గడ్డపని చేసేవాడు. పెళ్ళాం బిడ్డల్ని అడ్డం పెట్టుకుని రాత్రిలురాత్రిలూ కుప్పవేసేవాడు. నూర్చేవాడు. రెండేళ్ళభాగోతమూ — 18 బస్తాలు కౌలుపోను మిగిలినదానికంటే తగలడమే మిగులయింది...

పెద్దకొడుక్కి వూళ్లోచదువుకాస్తా అయిపోయి బస్తీకెక్కాల్సివచ్చింది. అక్కడ ఆ చదువుకు జీతంచెల్లించాలట. పొట్టకీ, బట్టకేకాక పుస్తకాలుకూడా కొనాల్సి వచ్చినందుకే తనపని మూలిగేనక్కమీద తాటికాయలా వుంది. జీతంకూడా కట్టాలంటే — ఎలా?

ఎవరో ఓ పుణ్యాత్ముడు ఓ ఉపాయంచెప్పి పుణ్యంకట్టుకున్నాడు.

'క్రిష్టియన్ మతంపుచ్చుకుంటే పిల్లవాడి చదువుకు జీతంచెల్లించనక్కర్లేదట'

ఏ మతమైతేఏమో! పేదవాళ్ళకందరికీ జీతాలు తీసే శేదానికి —

తెల్లవాడిరాజ్యంకాదూ? పాడు రాజ్యం. యిట్లా యిరకాటానబెట్టి మతం మార్పించడం ఎందుకో?

పెళ్ళాన్ని పెటపెటాలమీద ఒప్పించాడు. ఓ ఆదివారంనాడు స్వామికాస్త్రా సాలమన్ ఐపోయాడు. ఒక పాపి అత్మను పరిశుద్ధంచేసి కోడిపెట్టా, బియ్యపుమూటతో సంతృప్తిపడ్డాడు ఫాదరీ.

ఆ ఫాదరీగారి పడి పంచలు కాసి ఎలాగైతేనేం? పిల్లవాణ్ణి బోర్డింగులోచేర్పించాడు. కళ్లన్నీ తెరచుకుని గాంధీగారి కాంగ్రెస్ రాజ్యంకోసం ఎదురుతెన్నులు చూస్తున్నాడు. యింటిదగ్గరున్న ఏకోద్దిష్టుణ్ణాలైనా పెళ్ళాని కదే చెబుతుంటాడు. హరిజనుడే రాజ్యంవ లేసంగతి నూరి పోస్తుంటాడు. మింగుడుపడుతున్నదో లేదోకూడా పట్టించుకోకుండానే.

స్వామి—కాదు కాదు, 'సాలమన్' అచ్చగా 24 గంటలూ ఆ ఆసామీల వాతావరణంలో తిరుగుతుంటాడు. పైగా వాళ్ళ యిష్టాలకు అనుగుణ్యంగా తన యిష్టాలను మార్చే 'మంచివాడా'యెను. అందుకే తన తోటివాళ్ళ కెవరికీ లేని నమ్మకాలు.

మొదటిసారిగా ఆవూరి పాలేర్లంతా మీటిం
గుకు పిలిస్తే సాలమన్ పోనేలేదు.

"అబ్బో ! మీకందరికీ జీతాలు పెరిగితే నాకూ
దానంతటదే పెరుగుద్దిలే" అంటూ వెకిలిగా దులపరిం
చుకు పోయాడు.

అంతా సమ్మెచేస్తుంటే సాలమన్ మాత్రం ఆ
మూడు రోజులూ ఆసాములతో 'చుట్టాలింటికి చూపు
కెళ్తున్నా' నని చెప్పిమరీ పారిపోయాడు.

రెండోయేడొచ్చేసరికి చాలా మార్పులు జరి
గాయి. హరిజనులు రాజ్యంచేసే గాంధీగారి రాజ్యం
రానేవచ్చింది. ఆ వూళ్ళో జరిగిన వూరేగింపులో ఎడ్ల
ముందు తాళ్లు పట్టుకుని సాలమనూ వూరేగాడు. ఊరి
మధ్యనే గాంధిగారి బొమ్మకూడా పెట్టారు. ఆ బొమ్మ
పెట్టిన నాయకుడు వాళ్ళ ఆసామీ యింట్లోనే మకాం
పెట్టాడు.

మొదటిసారిగా-యింట్లో నీళ్లుతేవడం, పక్కలు
వేయడం అంతా సాలమన్‌కు అప్పగించారు. ఆవేళనించీ
సాలమన్‌కు పొలంరాజ్యానికి తోడు యింటిరాజ్యంకూడా
కలిసిన చాకిరీతో-హరిజనుడిమీద రాజ్యంవచ్చిపడ్డంత
బరువూ ఎక్కింది.

ఈరెండురాజ్యాలతోనూ అతడికి తీరికేలేకుండా
పోయింది. అయినా ఏదో తనలాంటివాళ్ళ రాజ్యం

రానేవచ్చిందన్న దిలాసాలోపడ్డాడు. ఈ మధ్యనే పాలేర్ల మీటింగుల్లోకికూడా అడపాదడపా పోతూవస్తూవున్నాడు. వీటన్నిటివల్లా — చిన్నప్పుడెప్పుడో అణిగిమణిగి అలా అడుగునపడివున్న స్వేచ్ఛాతత్వం పైకిరావడానికి గింజుకొంటోంది.

ఎడ్లకుపెట్టే గుగ్గిళ్లబుట్టలు, వుచ్చబట్టే కుండలతో పాకే—చావిట్లో వంకెలను వ్రేలాడే పాలేళ్ళ అన్నపు గిన్నెలు, ముంతలూ, నిత్యమూ వెక్కిరిస్తున్నాయి—సాలమన్ హరిజన రాజరికాన్ని—

ఈ రాజ్యం రావడమే తనకొడుకు చదువుకు జీతం కట్టమన్నారు. 'హరిజనుడు అయితే పిల్లవాడి చదువుకు జీతం చెల్లించనక్కర్లేద' ట — ఏమతమైతేఏమో! పేదపిల్లలకందరికీ జీతంలేకుండా చదువుచెప్పించేదానికి —

మళ్ళీ మతంమార్చుకోవాలట. హరిజనుడు కావాలట.

దీన్ని 'పాడురాజ్యం' అనలేకపోయాడు. కాని తాను కలలుగన్న రాజ్యంవచ్చినా పరిస్థితులు పాడుగానే వున్నాయి. తన ఆశలుమాత్రం బీడుల్లాగా అలా అలా పెరుగుతూనే వున్నాయి.

మామ మొత్తం సంసారాన్నంతా వేసుకొచ్చి యీకాస్త గుడిసెమీద పడ్డాడు. వాళ్ళవ్రాళ్లో రూపాయి

ఖాలీ కావాలని అన్నందుకు ఆసామి, కాంగ్రెసు, పోలీసులు, గూడెం మొత్తాన్నీ చితకపొడిచి వదిలారట.

అదుగో అక్కడ – ఇదిగో యిక్కడ. ఎక్కడెక్కడో ఏవేవో గొడవలు.

ఈ రాజ్యంవస్తే అందరికీ స్వతంత్రం అందరికీ సుఖం అన్నారే? అదంతా ఏమైపోయింది. పంచభక్ష్యాలూ, పరమాన్నాలూ వద్దనేవద్దు. పస్తులు లేకుండా బ్రతికేందుకేనా నోచుకోలేదా? జీతాలు పెంచమంటే పోలీసుల్ని తెస్తారా? పెంచకపోతేమానె తగ్గిస్తారా? ఆ తక్కువజీతాలకురాకపోతే పోలీసులువస్తారా? ఎందుకు? కనీసం ''యీ జీతాలకు మేంరాం'' అనడానికీ మానుకోడానికీకూడా నోచుకోలేదా? అయితే యీ రాజ్యంఎవరికి?

ఈ ఊళ్ళోకూడా షావుకార్లంతా కూడబలుక్కున్నారు. యీసారి జీతాలు పెంచమంటే పోలీసుల్ని తెస్తారట. ఒకనాడు చెప్పనేచెప్పారు. 'పెంచమనడం గాదు, నిరుడుపెంచిన పాతికలు ఈఏడు కోస్తాం, వస్తారా? రారా?' అని.

'వచ్చి కూటికిమాడి ఎవరు చస్తారు?'

'రాకఆపోలీసు పోట్లక్రిందఎవరుబ్రతుకుతారు?'

సాలమన్ ఆవేళే మొదటిసారిగా నోరు తెరిచాడు. 'యిటు తిండికి లేకై తేనేం—అటుదెబ్బలకై తేనేం ఎలాగైనా చస్తాం.'

అదే మొదలు మూగగొంతు విప్పుకొంది.

ఎన్నడూ లేని నోరు విప్పుకోడం షావుకార్లకు మరింత కోపకారణమయింది. సాలమన్‌మీద భగ్గుమం టున్నారు.

"యీ చేతులు చూచావా? పాతికేళ్ళంటే పాతికేళ్లు—ఆ దొరలకు చాకిరీ చేసిపెట్టాయి. యిప్పుడీ చేతులకే జోళ్లు వేయిస్తారట"

"బిడ్డలకూ్కడా అట్లాచేసుకోం"

"ఆబిడ్డలూ ఆళ్ళకే చేయడమాయె"

"ఇక అట్టాఐతే కుదరదబ్బా"

మీటింగులుజోరుగాసాగుతున్నాయి. తక్కువ జీతాలకెవ్వరూ పోరుట.

"ఎంత పొగర్లెక్కినాయి? పుట్టినప్పట్నించీ మనకాడ పొట్టబుచ్చుకుని బతికిన వీళ్ళకి యింత దిమ్మా"

"యీాళ్లు అడిగినంతా యివ్వడానికి యీాళ్ళ తాతగాడిముల్లె దాచిబెట్టారా?"

"బతకలేరు వెధవలని చూస్తుంటే—"

"ఎంతకైనాసరే యింకెవళ్ళనన్నా తేవాల్సిందేగాని – యీాళ్ళకిమాత్రిం జీతాలుకోసెయ్యాలి."

అంకిని 'అంకమ్మా' అంటే మరోసారి పిలవ మండట—"

షావుకార్లు భగ్గుమంటున్నారు. నిరుటిజీతాలు

తగ్గించి తీరాలట. యింతా అని జీతం అడగరాదట. యిష్ట మొచ్చినంత యిస్తారట.

*　　*　　*

"ఏరా? యేంతేల్చుకున్నారు?"

"తేలేందు కేముందండీ! ఎప్పటిమామూలేగా?"

"ఏమిటా మామూలు?"

"మీ రెరుగందేముందండీ? నిరుడిచ్చిన జీతా లేనా? కాళపోతే ఎవడేనా ఎదిగినాడుంటే కాస్త ఎక్కువడుగు తాడు"

"మీరడిగినంతా యియ్యడానికి యిక్కడ దాచబెట్టారా?"

"ఎవరన్నారండీ! మేమడిగినంతా యియ్యడా నికి మీరు దాచబెట్టనూ లేదు; మీరు రమ్మన్నంతకే రావ డానికి మీరు మమ్మల్ని పోషించడమూ లేదు."

"ఏం కూశావురా?"

"ఉన్న దేగదండీ అన్నాను—"

"మా యిష్టమొచ్చినట్టు యిస్తాం"

"మా యిష్టమైతే వస్తాంగదండీ."

"ఒహో! ...ఒరేయ్ నూకలుంటే కాకులు కావలసినన్నిరా—"

"కాదంటండీ—రెక్కలాడితేనే—నూకలున్నా"

"అంత మిర్రుగావుందన్న మాట... చూస్తాం—"

"ఎవరి మిర్రు ఎవరి కొస్తదండీ – మా పాప మిట్లా పండి మనుషులం మార్కెట్టులో సరుకులాగా అయిపోయాం. అంతా బేరమే. మీకు యిష్టమైతేకొం టారు; మాకు యిష్టమైతే అమ్ముతాం. అంతేనా?"

"ఎట్టా రారో చూస్తాంగా. పరిక్కవాళ్ళల్లో చూస్తన్నారా?"

"మాకు యిష్టంలేకపోతే మా చేతెవరు పని చేయిస్తారు–? అదీ చూద్దాం..."

* * *

రోజులు గడుస్తున్నాయి. ఎక్కడా ఒక్కజీత గాడులేడు. పొరుగూళ్లనించి ఎంతకూ ఎవరూ రావడం లేదు. భవంతుల్లోని అసూర్యంపశ్యలు ఆడవాళ్లు మొదట్లో మొగుళ్ల మీద విసుక్కుని, తర్వాతగొణుక్కుని యిప్పుడు పెద్దగానే తిట్టిపోస్తున్నారు. బొబ్బలుపొక్కు తున్న చేతులూ, కారుతున్న చెమటలూ, కందుతూన్న ఒళ్లూ చూస్తుంటే మగాళ్లకీ కష్టంగానేవుంది. కాని తీరా యింతఅయ్యాక లొంగితే—?

అమ్మా! తలగుడ్డలు పడిపోవూ?

రోజులు గడుస్తున్నాయి. వాళ్లూ పస్తులుంటు న్నారు. కానిలొంగరే–తీరా యింతఅయ్యాక లొంగితే–?

నీళ్లగంజికూడా లేకుండా అరవచాకిరీచేయించు కుంటారు. అటైనా యిటైనా చావు చావే.

పోలీసులకి రిపోర్టులు పోతున్నాయి. వూళ్లో దుండగీళ్లు బయల్దేరారట, పోలీసులచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. వూరుచుట్టూ దుండగీళ్లేనట. పోలీసుల ముందు వలవలామంటున్నారు. తమ ధనమానప్రాణాలకి రక్షణలేదట. ఋజువులు చూపెడ్తున్నారు. ఒక్క కూలివాడూ పనికిరావడంలేదట. ఎంతబడితేఅంతకూలి అడుగుతున్నారట. చాకిరీచెయ్యడమెందుకు దోచుకుపోతామంటున్నారట—

కూలివాడు పనికిరావడంలేదంటే—? వాడియిష్టమైతేవస్తాడు; ఎంతబడితే అంత అడుగుతున్నాడంటే—? అంతా యిచ్చినవాళ్ళకే పోతాడు. ఇందులో పోలీసులు చేసేదేముంది! దోచుకుపోతారా — దోచుకోకముందే ఎవరిని పట్టుకోడం—? మామూలు పోలీసులకిందులో ఏముందో తోచలా?

కూలివాడు పనికిరానంటున్నాడూ? వుత్పత్తిని కుంటుబరచచూస్తున్నాడన్నమాట. ఎంతబడితేఅంత అడుగుతున్నాడూ? పనిని స్థభింపజేసి దేశీయ సంపదని పాడుజేసి తద్వారా ప్రభుత్వాన్ని చిక్కుల్లోబెట్టి పడదోయబోతున్నాడన్నమాట. యిది చట్టధిక్కారం. తిరుగుబాటు — తప్పకుండా దోపిడీలు సాగిస్తారు — తోచింది చెప్పాడు పోలీస్ ఆఫీసరు.

పోలీసులు హుటాహుటీవచ్చిదిగారు. అందిన

వాణ్ణి అందినట్టల్లా పేట్రేగేట్టు కొట్టిపోయారు. ఎవర్నీ ఏమీ చెప్పుకోనివ్వలేదు. పోతూపోతూ ఆఫీసరుమాత్రం చెప్పాడు.

"రెండురోజుల్లో మళ్ళీవస్తాం. అంతా పిల్లా పీచుతోసహా పనుల్లోకివెళ్ళాలి. లేకపోతే—"

ఆ రెండురోజులూ గడిచాయి. ఒక్కరూ పనుల్లోకిపోలేదు. ఎవడన్నా పోదామనుకున్నా కాళ్ళూ కీళ్ళూ ఒళ్ళూ అతగాడి స్వాధీనంలోవుంటేగాదూ?

షావుకార్లకు మరింత కోపం వచ్చింది. మర్ధనంవల్లకూడా గుణవర్ధనంకాలేదంటే యేమిటి? పోలీసు కాంపుకుపోయి బావురుమన్నారు. ప్రాణభిక్షపెట్టమని ప్రాధేయపడ్డారు. ప్రాణం మినహా మానం నీదేనన్నారు.

ఆఫీసరు మండిపోయాడు. లారీలు రణగొణ ధ్వనిచేస్తూ బయలుదేరాయి.

సాలమన్‌కు పిచ్చెత్తినట్టయింది. ఇదేమిటి? ఇదేమి హరిజనరాజ్యం. యీసారి పోలీసులొస్తే తేల్చుకోవాలి.

పోలీసులువచ్చేసరికల్లా వూరుమధ్య తనవాళ్ళని పోగుజేసి ముందునిలబడ్డాడు. చెప్పుకోవలసిందంతా చెప్పుకోవాలి. అన్యాయాన్ని బద్దలుచెయ్యాలి. షావుకార్లని నిగ్గదీసి అడగాలి—పోలీసులకి చెప్పుకోవాలేగాని న్యాయం జరిగితీరుతుంది.

లారీ ఆగడమే పోలీసులు చుట్టుముట్టారు. పారి పోడానికూడా వీలుదొరకకుండా చక్రబంధంలోపడ్డారు.

లారీలో ముందుసీటులో ఆఫీసరుతోపాటు కూచున్న షాహుకారు గొల్లుమన్నాడు.

“సమయానికి తమరు దయచేశారు. లేకపోతే యీజనం ఏమయినా చేసివుందుర''ని-

సాలమన్‌కు దిక్కుతోచడం లేదు. గుంపు మొత్తం ఛేదించబడుతోంది. కీళ్లుతొలుగుతున్నాయి. తలలు పగుల్తున్నాయి. రక్తాలు కారుతున్నాయి. కాకిగోలగావుంది. కుప్పల్లా ఒక్కొక్కరే కూలబడిపోతున్నారు. ఏమిచెయ్యడం ? ఏమీచెప్పుకునేందుకూడా లేదే?

లారీలోవున్న ఆఫీసర్ని చూచాడు. ఒకవైపున మీాద దెబ్బలుపడుతోన్నా లెక్కచెయ్యకుండా లారీవైపు పరుగెత్తుతున్నాడు. ఆయనతో చెప్పుకుంటాడు. ఆయన కాళ్లు పట్టుకుంటాడు. నిజాన్ని బయటికితేవాలి. తన జనం కోసం ఏదైనాచేస్తాడు. నిజంకోసం ఏమైనా అవుతాడు. అదే అతని ఆరాటం. పరుగెత్తుతున్నాడు లారీకేసి...

లారీలో కూచున్న షావుకారు కెవ్వున కేక బెట్టాడు. ‘తనని చంపవస్తున్నా’డని —

లారీలో కూచున్న ఆఫీసరు సరిగ్గా కాల్చాడు. శరణన్న షావుకారి ప్రాణం రక్షించేందుకు-

పోతూన్న సాలమన్ అక్కడికక్కడే విరుచుకు పడి గిలగిలా తన్నుకున్నాడు. ప్రాణమూ, దానితోపాటు అతను బయటికి తేదలుచుకున్న న్యాయమూ, రెండూ గాలిలో కలిసిపోయాయి.

అతడితోపాటే – హరిజనులు రాజ్యంచేసే అతగాడి అసలు ఆశ, తన పిల్లల చదువు సంధ్యలకొసరు ఆశలూ మట్టిలో కలిసిపోయాయి.

ఆ గోరీలదొడ్లో – అన్నిగోరీలమధ్య తలెత్తి నిటారుగా నిలబడ్డ ఆ రాతిపలక–

'సాలమన్ ప్రభువునందు నిద్రించెను' అనడానికి బదులు...

'నీఆశయం మేం నెరవేరుస్తాం'

—అంటూ పీడిత ప్రజాహృదయాల్లో ప్రతిక్షణం ప్రజ్వలింపజేస్తుంటుంది.

ST. JOSEPH'S GIRLS' HIGHER SECONDARY SCHOOL, GUNTUR.